# యాత్ర

కోపతాపాలు ప్రేమను పెంచాలే తప్ప తుంచకూడదు. అలా పెచ్చుపెరిగేది నిజమైన ప్రేమ, తునాతునకలయ్యేది ప్రేమ అనే భ్రమ.

సాయంత్రం బయలుదేరిన టూరిస్టు బస్సుల్లో తోవలో యాత్రికులు ఎక్కుతూనే ఉన్నారు. అది యాత్రా స్పెషల్ అయినా, అందులో యోగులూ, రోగులూ, భోగులూ, ఉండటం వలన ఎవరికీ సరిగ్గా నిద్ర లేదు. ఒక నవీన జంటలో అందచందాలు పోటీ పడ్డట్లు మూర్తీభవించి ఉన్నాయి. ఒకరు అర్జిస్తే, ఇంకొకరు కూర్చునేవాళ్లు కారు. ఇద్దరిలో ఏ ఒకరూ నోరు పెట్టుకుని బతుకుతున్నట్లు లేరు. చూపుల్లో సూటిగల జంటలా ఉన్నారు. అందుకే కామోసు అందరి దృష్టి ఈ జంట పైనే ఉంది.

తొలిసారి ఒకాయన అర్థం కాని కేకలతో అందరి దృష్టి ఆ జంట నుంచి ఈ జంట వేపు మరలింది. కారం తిన్నట్లు కోపంతో ఆ ముసలాడు పెళ్ళాం మీద అరుస్తున్నాడు. అంత అరచినా ఆవిడ చిరాకు పడలేదు, జవాబు చెప్పలేదు, ఏడవలేదు, నవ్వలేదు.

తొలి మజిలీ విజయవాడలో కొత్త జంట అనిత, ఆనందరావులు పాత జంట శేషమ్మ, విశ్వేశ్వరయ్యలను కలుసుకున్నారు. కనకదుర్గ దర్శనం చేసుకుని కొండ దిగి వచ్చేసరికి ఎండ ప్రభావమో ఏమిటో ముసలాడు మళ్లీ కస్సుమన్నాడు. ఈసారి పెళ్ళాం మీద కాదు, ఏదో జవాబు చెప్పిన ఆనందరావు మీద.

"ఇదంతా అబద్ధం. స్టవ్ మీద పాలు పొంగడం చూశావా? తరువాత పాలగతి ఏం అవుతుందో ఆలోచించావా?"

అందరి ముఖాలు అటు తిరగగానే మాటాడకుండా ఆనందరావు తన సీటులోనికి వచ్చి కూర్చున్నాడు. వాడంబరం రంగు జరీ నేత చీర కట్టుకున్న శేషమ్మతో అనిత "అంత కోపిష్ఠి మొగుడ్ని ఎలా భరించగలుగుతున్నారు?" అని అడిగింది. ముక్కులో బేసరి వజ్రం మెరసిపోతుంటే, ముత్యాల్లా మిగిలిన పళ్ళ చిరునగవుతో "అతని కోపంతో అతను నన్ను జయించనూ లేదు – నా శాంతంతో నేను ఓడిపోనూ లేదు" అన్నది.

ఇక తిరుపతి కొండ మీద ఈ జంటకూ, వాళ్ళకు భేటీ పడింది. భక్తితో ముసలి జంట హుండీలో డబ్బు వేసి వస్తుంటే, ఇదేదో తమాషా అని నవీన

జంట బయట నిలబడి చూస్తుంటే విశ్వేశ్వరయ్య కలుగజేసుకుని – "వెళ్ళవయ్యా, హుండీలో వెయ్యి – స్వామివారికి చేరుతుంది" అంటే, ఆనందరావు వెటకారంగా "మాకేం అలాంటి నమ్మకాలు లేవు" అన్నాడు. దాంతో ముసలాడికి కోపం వచ్చి "దేవునికే దానం చెయ్యకుండా నీలో దెయ్యానికి మేపుతున్నావు, జాగర్త! ఆ దెయ్యం బలిసి ఒకనాడు నీ పీక పిసుకుతుంది," అన్నాడు.

ఈ కేకలతో ఆగిన భక్తుల్లో ఒకడు "ఏవడు బాబూ ఆ మనిషి లోపలి దెయ్యం?' అడిగాడు.

"సొంత లాభం."

ఆనందరావు చలించి వెళ్ళిపోయాడు. అనిత ఆ జంట వెంటనే నడుస్తూ అతనితో "అన్నిటికీ మీకు కోపం వస్తోంది. అరుస్తున్నారు. ఒకసారి డాక్టర్ని చూసి రక్తపోటుందేమో తెలుసుకోండి," అంది. ఆ పెద్దస్వరంతోనే "నాకా? రక్తపోటా? అసలు కోపం గురించి మీ జంటకు తెలుసా? కోపగించుకోని వాళ్ళకి కోపం గురించి ఏం తెలుసు? తాగనివాళ్ళు తాగుడు గురించి లెక్చరిచ్చినట్లే కదా!" అనగానే ఆనందరావుకు ఒళ్ళు మండి –

"మీరు తాగుతుంటారా?" అన్నాడు.

"సర్వ రోగాలకు సారాయి మందని తప్పతాగలేదు. కానీ అడపా తడపా ఆ మజా మందు వేసుకున్నాను."

ఇంత బహాటంగా పెళ్ళాం ఎదరగానే చెప్పుకుంటున్నవానితో మళ్ళీ కాంచీపురంలో వామనగుడి బయట భేటీ పడింది. ఆనందరావు వేళాకోళంగా "మీదీ వామనావతారమే! మీ కోపంతో ఎవరి నెత్తి మీదో పాదం పెట్టి ఉంటారు" అంటే – "నువ్వు ఉత్తి అజ్ఞానివయ్యా! కోపం రాకపోతే ఏ పనీ జరగదని తెలీదా? వామనుని కోపం అతని గొప్పకు ముప్పు తెచ్చిందా?" అన్నాడు.

చాటుగా అనిత శేషమ్మతో "అతని కోపం నిత్యం ఉన్నదేనని ఖాతరు చెయ్యరా?" అంటే, మళ్ళీ అదే నగవుతో –

"అతనికి కోపం వస్తే నేను ఆపే యత్నం చెయ్యను. కొంతసేపయ్యాక కోపం కరిగిన జాగాలో అభిమానం పొంగి పొరలుతుంది" అంది.

చిదంబరం నటరాజస్వామి ఆలయం ఎదరగా పెళ్ళాన్ని ఎడమవేపు పెట్టి, ఆమె కుడి చేతిని తన ఎడమ చేతితో పట్టుకుని నాట్యం చేస్తున్నట్లు ఆవేశంతో గెంతుతుంటే, వీడెవడో పిచ్చివాడన్నట్లు కొత్త జంట నవ్వుకుంటున్నారు.

"నీ పెళ్ళాన్ని పట్టుకుని మాకన్నా జోరుగా నాట్యం చెయ్యవయ్యా ఆనందరావూ! ఆ నటరాజ విగ్రహంలో ఆది దంపతులు అర్ధనారీశ్వరుని రూపంలో ఉన్నారు, చూడలేదా? ఆలస్యం చెయ్యక. సిగ్గుపడకు... కానీ..." అంటూ ముసలాడు ఆయాసపడనట్లు గెంతుతూ మధ్యలో "నమో నమో నటరాజా" అంటూ పాడుకుంటున్నాడు.

కావేరి నదిలో ముసలాడు పెళ్ళాం చీర చెంగు పట్టుకుని స్నానం ఆడుతుంటే, ఒడ్డున ఉన్న నవీన జంట నవ్వుకుంటే ఎలా చూశాడో ఏమిటో మరి శ్రీరంగనాథుని సేవించి తిరిగి వస్తూ బిగ్గరగా "ఆనందరావూ! మీరిద్దరూ పులుల్లా ఉన్నారే!

అందుకే ఇద్దరూ మా అన్యోన్యతకు నవ్వుతూ వేళాకోళం చేస్తున్నారు. మీలో ఎవరో ఒకరు మేక అయితేగాని జంటగా వున్నదాంట్లోని ఆనందం అనుభవించలేరయ్యా!" అన్నాడు.

"ఒకరు పులి, ఇంకొకరు మేక అయితే పులి మేకను మింగేదా? ఇంకెక్కడి అన్యోన్యం?" అని ఆనందరావు ఎదురు చెప్పాడు.

"ఇద్దరిలో ఎవరు ప్రేమించి పెళ్ళి చేసుకుంటే విడాకులు తప్పతాయో ఆలోచించి చెప్పు" అన్నాడు.

అంటూ వెళ్ళిపోతే ఇద్దరూ జంబుకేశ్వరంలో అపురూపంగా చెక్కిన రాతిస్తంభాల దగ్గర నిల్చొని లోపలి గర్భగుడివేపు చూస్తూ –

"ఎవరు చెక్కారో?" అని ఆనందరావు అంటే –

"దేనిని?"

"శివలింగాన్ని"

"దృష్టి దోషమా? చూడు ఏముందో?"

"ఇంకేముంది?"

"శివలింగం అంటే అర్థం తెలియనివాళ్ళు జంటలవుతున్నారు? కర్మ."

"మీ కళ్ళతో చూసి చెప్పండి."

"ఆ దిగువున పవనిపట్టం రూపంలో ఉన్న పార్వతి కనపడలేదా?"

"ఇవన్నీ కట్టుకథలు" అని యువకుడు తేల్చేస్తే –

"మనిషి ముందు పుట్టాడా – దేవాలయాలు ముందు పుట్టాయా? భక్తి లేని మనసుతో వచ్చారు. ఈ దేవాలయాల్లో కనీసం మనిషి రూపురేఖలు గురించైనా తెలుసుకోడానికి ఆలోచించండి."

మధురలో నాలుగు గోపురాలవైపు చూసి, కళ్యాణ సుందరేశ్వరుల నిలువెత్తు నల్లని విగ్రహం కలసి చూస్తున్నప్పుడు –

"ఏంటయ్యా అలా చూస్తున్నారు? వాళ్ళదీ ప్రేమ పెళ్ళనా? వాళ్ళు నిత్య కళ్యాణం జరిపించుకున్నట్లు బతుకుతారు. ఈనాటి ప్రేమికుల్లా పంతానికి పోయి పసివాళ్ళు కాలేదులే."

మధురలో ఈ జంటని పట్టించుకోనివాళ్ళు, రామేశ్వరంలో వాళ్ళు ఇరవై రెండు నూతుల్లో అదేపనిగా స్నానం చేస్తుంటే, వాళ్ళ వెంటనే ఆ పని చెయ్యకుండా అంత దూరంలో కదులుతున్న ఈ కొత్త జంటలో మగాడు జాలిగా "అదే పనిగా ఆ చన్నీళ్ళు బాల్చీలతో నెత్తిమీదనించి పోసుకుంటున్నారు. ఈ వయసులో నిమోనియా రాగలదు" అంటే, ముసలాడు అదే ధాటిలో "మంచిపని చేస్తుంటే చెడు దాపరిస్తుందని ఆలోచిస్తున్నావేమిటి? ఏ కీడూ రాకుండా రామేశ్వరుడు రక్షిస్తాడని ఈ పవిత్ర స్నానాలు చేస్తుంటే..." అన్నాడు.

"ఏ కీడు వస్తుందనుకుంటున్నారు?" అని ప్రశ్నించాడు.

ఈ ప్రశ్నకు జవాబు రాలేదు.

శ్రీశైలంలో పాతాళ గంగకు వెళ్ళేటప్పుడు ఎవరు జారి పడకుండా ఉంటే, వాళ్ళే సంసార యాత్ర సరిగ్గా చెయ్యగలరని ముసలాడే పందెం వేశాడు. ఆనందరావే

జారి పడ్డాడు. ముసలాడు నవ్వకపోగానే "మీకెప్పుడూ నవ్వూ రాదా?" అంటే –

"వస్తుంది. నా కన్నా తెలివైనవాడు నన్ను ఓడిస్తే."

"మీరు ఎప్పుడూ తప్పులు చెయ్యలేదా?"

"ముఖం చెల్లని తప్పులు చెయ్యలేదనుకుంటాను."

"మీ ఆవిడని ఎప్పుడైనా పొగుడ్తారా?"

"ఈ ప్రశ్న ఆవిడకే వెయ్యి."

అనిత అతను వింటుండగానే ఆ ప్రశ్న శేషమ్మపై ప్రయోగిస్తే, ఆమె నవ్వుతూ "వయసులో ఉన్నప్పుడే పొగడంది ఇప్పుడా? నన్ను పొగడ్డానికి ఆయన నన్ను గుడ్డిగా ప్రేమించలేదు. మా పెళ్ళికి అతనికి పదిహేను – నాది ఎనిమిదేళ్ళ వయసు. నా తప్పులు అతను చూపితే కదా అతని దృష్టి సరిగ్గా వుందని అనుకుంటాను. నా తప్పు దారి వదలి ఒప్పుల దారిలో పడ్డాను," అంది.

"ఇంత కోపిష్ఠి మొగుడు కదా – నాలుగు తిట్టాక ఎప్పుడైనా బతిమాలాడా?" అడిగింది అనిత.

"నేను బతిమాలించుకోవడం ఏం బాగు? మొగుడని కాదు. వయసులో అతను నా కన్నా పెద్ద. ఆమాత్రం వయసుకు మర్యాద ఇవ్వొద్దా? మీరు మా వయసుకు మర్యాద ఇచ్చి మావెంటే ఉంటున్నారు కదా!"

"అతను ఎప్పుడైనా చెయ్యరాని పని చేస్తారా?"

"చెయ్యరాని పని చేస్తే – దానిని మార్చలేం. కప్పుకోవడం కంటే, ఒప్పుకోవడం మంచిది కదా! దానివలన భార్యభర్తల్లో ఒకరి మీద ఇంకొకరికి నమ్మకం కుదురుతుంది."

భద్రాచలంలో గోదావరి నదిలో స్నానం చేస్తూనే ముసలాడు పెళ్ళాం మీద కస్సుమంటున్నాడు. ఆ కోపం గట్టు మీద నిల్చున్న ఈ నవీన జంట చెవుల్లో రింగుమనగానే –

"మీరు ఎంత పెళ్ళాన్ని పోషించినా ఇదేమిటండీ ఆవిడ మీద అందరి ఎదరగా అలా కేకలేస్తారు?" అన్నాడు ఆనందరావు.

"నా పెళ్ళాం స్థిరాస్తిని నేనేనయ్యా! నా కేకలకి నా పెళ్ళాం గుండె ఆగిపోదులే. ఆ భయం నీకెందుకు? ఫో ఫో" అని చిరాగ్గా అందరి ఎదరగా మెడ పట్టుకు గెంటినట్లు మాట్లాడితే, ఇద్దరూ అక్కడనించి వెళ్ళిపోయారు. మళ్ళీ వీళ్ళ దగ్గరకు రాలేదు.

అన్నవరంలో ఉదయమే సత్యన్నారాయణ స్వామి దర్శనం అయిపోయింది. తెల్లని పంచె, లాల్చీ, ముఖాన తిన్నగా ఉన్న కుంకుమ బొట్టు, మెడలో నూరు వరహాల పూలదండ వేసుకుని గులాబీ తోట పక్కన ఉన్న గట్టు మీద విశ్వేశ్వరయ్య కూర్చున్నాడు. పక్కనే శేషమ్మ పసుపు రంగు పట్టు చీర కట్టుకుని పార్వతీదేవిలా కూర్చుంది. వీళ్ళవేపు చూడకుండా అలా వెళ్ళిపోతున్న అనిత – ఆనందరావులను చూసి ముసలాడు –

"ఇలా వచ్చి కూర్చో నాయనా! రా అమ్మా అనితా! ముళ్ళున్న ఈ గులాబి చెట్లు ఎంత అందమైన పూలతో విరబూశాయో చూడండి," అన్నాడు.

ఈ ఆప్యాయతను తేనెలా నోటితో పోస్తున్న గొంతుక విశ్వేశ్వరయ్యదని నమ్మలేని నవీన జంట ఒకేసారి అతని వేపు చూశారు. ఆ ముఖంలో చిరునగవు చిందులు

తొక్కుతోంది. ఈ ఆహ్వానాన్ని తిరస్కరించలేని నగవు అది. ఆ మెడలో ఉన్న పూలమాల గుబాళింపుతో లాగుతున్నట్లుందీతని పిలుపు. వచ్చిన వాళ్ళిద్దరినీ పక్కన కూర్చోబెట్టుకున్నారు. విశ్వేశ్వరయ్య నెమ్మదిగా అన్నాడు:

"ఈ టూరిస్టు బస్సు ఎక్కకముందు మీరెవరో మాకు తెలీదు. మేం ఎవరమో మీకు తెలియదు. నా కోపానికి మీ ఇద్దరూ హడలిపోయారు. అయినా, అలా మా వెంట వెంట పడుతూనే ఉన్నారంటే, మా మీద అభిమానం ఉండబట్టే కదా! ఈ పదిహేను రోజుల్లో మీతో కలసిన అనుబంధంతో, మిమ్మల్ని వదలిపెట్టడమంటే కష్టంగా ఉంది. నా కోపం గురించే కదా మీ బాధ. గుర్తుందా? కనకదుర్గ ఆలయం దగ్గర పాలు పొంగడం గురించి చెప్పాను. కాచిన పాలు కాఫీలో కలిపాం, పెరుగు చుక్కతో చేర్చాం, చిలికి వెన్న తీశాం, వెన్న కాచి నెయ్యి చేసుకున్నాం. ఇన్ని బాధలూ మార్పులూ, ఓర్పులూ చేర్పులూ చేసి సంసారులయ్యాం. మా అనుబంధం యాభై అయిదేళ్ళది. వయసులోనే లేనిది, ఇప్పుడు ఒకరినొకరు వదిలేస్తామని మీ భయమా? నాకు ఆమె కావాలి – నేను ఆమెకు కావాలి". ఒకసారి నవీన జంట వేపు సాదరంగా చూసి అన్నాడు: "రామేశ్వరంలో మాకెక్కడ రొంప పట్టుకుంటుందోనని మీరు భయపడుతుంటే, ఏ కీడూ రాకుండా రామేశ్వరుడు రక్షిస్తాడని ఈ పవిత్ర స్నానాలు చేస్తున్నామని నేను అంటే – ఏ కీడు వస్తుందని మీరు అనుకుంటున్నారని నువ్వు ప్రశ్న వేశావు. అప్పుడు జవాబు చెప్పలేదు. నా పెళ్ళాం నాకన్నా ముందు పోతానంటుంది. ఆమెకన్నా వయసులో నేను పెద్ద కనుక, నేనే ముందు పోతానని నా నమ్మకం. బలవంతంగా ఇద్దరూ ఒక్కసారి పోవడం ఇష్టం లేదు. దేముడా, చావు ఇద్దరికీ ఒకేసారి వచ్చేట్లు చూడు. లేక ఇద్దరి చావుల మధ్య కాలాన్ని తగ్గించు అని స్నానాలు చేస్తూ కోరుకున్నాం."

మెల్లగా సహజంగా వచ్చే ఈ మాటకు ఇప్పుడే చిన్న సంశయం వచ్చి అడ్డు పడినట్లు అనిత అడిగింది–

"మీ పిల్లలు చూడరా?", అని.

ముసలాడు మాట్లాడకుండా ముఖం తిప్పేశాడు. కాస్సేపయ్యాక మాటలు మార్చుదామన్నట్లు గంభీర వదనం పెట్టి–

"అసలు విషయం అడుగుతున్నారనుకున్నాను. అడగలేదేం?" అన్నాడు.

"ఏమిటా విషయం?" అన్నాడు ఆనందరావు.

"విజయవాడ చేరేముందు ఆ ఉదయం మా ఆవిడమీద అరిస్తే కదా మీ దృష్టి నామీద పడింది. ఎందుకు కోపగించానని అడగరేం?"

"చెప్పండి వింటాాం" అంది అనిత.

"ఇంట్లో ఉంటే, రాత్రి పస్తు ఉంటే ఫరవాలేదు. బస్సు ప్రయాణం. కడుపులో ఏమీ లేకపోతే పైత్యం పెరగదూ? కొన్న అరటి పళ్ళు అలాగే ఉన్నాయి. నీరసం చేస్తే తీర్థయాత్రలు చెయ్యగలదా? ఆవిడ తినలేదనే ఆ కేకలు వేశాను."

"ఇంతకీ రాత్రి పస్తుండడానికి కారణం?"

ప్రశ్న వేసి అలా కళ్ళప్పజెప్పి అతని ముఖం వేపు చూస్తున్న జంటకు జవాబు అతని కళ్ళలో ఉబుకుతున్న కన్నీటిలో కనిపిస్తోంది. కాస్సేపయ్యాక శోకంతో పట్టిన

గొంతు నించి "ఉన్న ఒక కొడుకు రైలు ప్రమాదంలో చచ్చిపోయిన రోజు నించి ఒక్క పూటే తింటుంది," అని వినిపించింది.

విశ్వేశ్వరయ్య లేచేముందు "మా చేతిలో ఉన్నది ఇద్దరం కలసి ఏడవడం, నవ్వడం, ఆలోచించుకోవడం, తప్పులు దిద్దుకోవడం. ఈ కలసి ఉండటంవలన సంసార యాత్ర చేసుకోగలుగుతున్నాం. ఈ తీర్థయాత్రలో మీలాంటి అన్యోన్యమైన జంటను కలవగలిగాం" అన్నాడు.

పట్నంలో మూడో అంతస్తు ఫ్లాటు. తిరిగి వచ్చిన తొలి రాత్రి రెండు పడగ్గదుల్లో చెరో గదిలో అనిత, ఆనందరావులు! యాత్రకు బయలుదేరేముందు ఉన్నట్లే ఇద్దరూ వేర్వేరు గదుల్లో ప్రవేశించారు. ఇద్దర్లోనూ అహం, ఇద్దర్నీ వేరు వేరు గదుల్లో నివాసానికి దారి తీసింది. ఇద్దరికీ విడాకులు తీసుకోవాలనే ఉండేది. ఇద్దరూ సరే అంటే వేగంగా ఈ బంధం తెగిపోతుందని ఇద్దరూ అనుకున్నా, ఎవరు ముందు చెప్తారని ఒకరినొకరు ఎదురు చూస్తున్నారు. ఈ యాత్ర తమ ప్రేమ జీవిత నటనకు ఆఖరి చరణం అని బయలుదేరారు.

ఇప్పుడు ఈ రాత్రి ఇద్దరికీ నిద్ర పట్టలేదు.

ఇద్దరూ కిటికీల నించి నక్షత్ర మండలాల వేపు చూస్తున్నారు. చల్లగా, హాయిగా గాలి వీస్తోంది. పాముల జంటలూ, నెమిళ్ళ జంటలూ ప్రేమతో విహరించే వాతావరణం.

అనితకు శేషమ్మ – ఆనందరావుకు విశ్వేశ్వరయ్య వెం' [illegible] ఉన్నట్లే ఉన్నారు. విశ్వేశ్వరయ్య ఈ నవీన జంట గురించి చేసిన పే [illegible] ...రావులోనే సిగ్గు పుట్టించింది.

ఝాము రాత్రి అయ్యాక మెల్లగా అతనే ఆమె గదిలోకి వచ్చాడు. అనిత ఇంకా కిటికీ నించి చూస్తూనే ఉంది.

ఆనందరావు మెల్లగా అన్నాడు: "తీర్థయాత్రల్లో ఇద్దరం ఆది దంపతుల రాతి విగ్రహానికి మొక్కలేదు. వాళ్ళ నమూనాలైనా జంట – శేషమ్మ, విశ్వేశ్వరయ్యలకు మొక్కకుండా ఉండలేము. మన ప్రేమ వివాహంలో నేనే నిన్ను ప్రేమించాను కాబట్టి, అతనన్న మేకలానే ఉంటానని హామీ ఇస్తున్నాను."

అనిత తిరిగి చూసింది. ఆ కళ్ళు పులి కళ్ళుగా లేవు. మెల్లగా – "నేను శేషమ్మగారిలా నెమ్మదిగా ఉండి మిమ్మల్ని జయిస్తాను" అంది.

పాలు పొంగడం మానింది.

ఆ చిక్కని మరిగిన పాలతో ఫిల్టర్ కాఫీ తాగినట్లు ఇద్దరూ తృప్తిపడ్డారు.

(ఇండియా టుడే – నవంబరు, 6–20, 1993)

* * *